సాక్షి ప్రకాశం

ఆదివారం । 18 । ఫిబ్రవరి । 2024



నవరత్నాలు పేదలకు వరం

నవరత్నాలు పేదలకు వరం అని దర్శి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. దర్శిలో ఆయన పర్యటించారు.

- 8లో..



మీపై నమ్మకంతో జగనన్న పంపాడు

వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులపై నమ్మకంతో సీఎం జగనన్న తనను మార్కాపురం పంపారని ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం

32/20

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

బ్యాక్‌లాగ్ పోస్టుల తుది మెరిట్ జాబితా విడుదల

ఒంగోలు సెంట్రల్: 2021-22 సంవత్సర విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక ఉద్యోగ నియామక ప్రక్రియలో భాగంగా అభ్యర్థుల అభ్యంతరాలను పరిగణించి కలెక్టర్ ఆదేశాల మేరకు తయారు చేసిన తుది మెరిట్ జాబితా వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జీ అర్చన తెలిపారు. గ్రూప్-4, క్లాస్-4 పోస్టులకు సంబంధించిన జాబితాను ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంటాయని చెప్పారు.www.prakasam.ap.gov.in/noticecategory/recruitment/ లో అందుబాటులో ఉందన్నారు. ఏవైనా సందేహ నివృత్తి కోసం 08592-281310 నంబర్‌కు పనివేళల్లో సంప్రదించాలని కోరారు.

జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిగా రవితేజ యాదవ్



కలెక్టర్‌కు పూలమొక్క అందజేస్తున్న జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రవితేజ

ఒంగోలు టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారిగా జె.రవితేజ యాదవ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. తాడేపల్లి ప్రధాన కార్యాలయం నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని స్కిల్ హబ్స్, స్కిల్ కాలేజీలు, డిగ్రీ, ఇంజినీరింగ్ కాలేజీలలోని విద్యార్థులకు, నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా జాబ్ మేళాలు నిర్వహించేందుకు ప్రణాళికబద్ధంగా ప్రయత్నిస్తానని చెప్పారు. ఇక్కడ జిల్లా నైపుణ్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న ఆర్.లోకనాథం బదిలీపై తిరుపతికి వెళ్లారు.

రైల్వే, డీఎస్సీ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

ఒంగోలు: నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులు మొత్తం 6100, కేంద్ర ప్రభుత్వం రైల్వే రీజియన్లలో అసిస్టెంట్ లోకో పైలెట్ 5696 ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేసిన దృష్ట్యా తమ సంస్థ తరఫున ఉచిత శిక్షణ అందిస్తున్నామని లాజిక్ అకాడమీ కరస్పాండెంట్ పి.విజయభాస్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక అంజయ్య రోడ్డులోని తమ సంస్థలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద విద్యార్థినీ విద్యార్థులకు డీఎస్సీ, రైల్వే ఉద్యోగాలకు శిక్షణ ఇస్తున్నామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలనుకున్న యువత ఈనెల 22వ తేదీలోపు తమ పేర్లను సెల్ 7207012758 నెంబర్‌లో సంప్రదించి నమోదు చేసుకోవాలన్నారు.

ప్రగతి మార్గాలు

పశ్చిమాన రోడ్లకు మహర్దశ పట్టింది. 2014 నుంచి 2019 వరకూ తెలుగుదేశ ప్రభుత్వం రహదారులను నిర్లక్ష్యం చేసింది. ఎక్కడ చూసినా అతుకుల గతుకుల రోడ్లు దర్శనమిచ్చేవి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక అవన్నీ రాచమార్గాలుగా మారాయి. మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం నియోజకవర్గాల పరిధిలో నాలుగేళ్లుగా రూ. 254 కోట్లు ఖర్చు చేసింది. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖల ఆధ్వర్యంలో కొత్త రోడ్ల నిర్మాణంతో పాటు రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న రహదారులకు మరమ్మతులు జరిగాయి. రహదారుల రూపురేఖలు మారిపోవడంతో జర్నీ సాఫీగా సాగిపోతోంది.

గిద్దలూరు నుంచి అమరావతి వరకూ హైవేరోడ్డు, మార్కాపురం నుంచి ఒంగోలు రహదారిలో ఉన్న పొదిలి వరకూ డబుల్‌రోడ్డు నిర్మాణం.



తర్లుపాడు మండలంలోని చెన్నారెడ్డిపల్లి - తుమ్మలచెరువు రోడ్డు

- పశ్చిమాన నాలుగున్నరేళ్లలో రోడ్ల అభివృద్ధికి రూ.254.74 కోట్లు
- పంచాయతీరాజ్ పరిధిలో రూ.169.07 కోట్లు
- ఆర్అండ్‌బీ పరిధిలో రూ.85.67 కోట్లు ఖర్చు
- నూతన రోడ్లతో పాటు, పాత రోడ్లకు మరమ్మతులు

మార్కాపురం: పశ్చిమ ప్రకాశం అభివృద్ధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించడంతో రోడ్ల రూపురేఖలు మారిపోయాయి. టీడీపీ హయాంలో గుంతలుపడి మరమ్మతులకు సైతం నోచుకోకుండా అధ్వానంగా మారి రాకపోకలకు ఇబ్బందికరంగా ఉండేది. ఆ రోడ్లన్నీ నేడు బాగుపడ్డాయి. ప్రజల అవస్థలు తప్పాయి. మార్కాపురం డివిజన్‌లోని ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ పరిధిలో మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు సబ్‌డివిజన్లు ఉన్నాయి. ఇందులో పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ పరిధిలో 2019 జూన్ 1 నుంచి ఇప్పటి వరకూ జరిగిన రోడ్ల అభివృద్ధి వివరాలు ఇలా

పంచాయతీ రాజ్ పరిధిలో: రూ.169.07 కోట్లు

మూడు నియోజకవర్గాల్లో ఏపీఆర్ఆర్‌సీ పథకం కింద 9 బీటీ రోడ్లు, 14 సీసీ రోడ్లను 41.5 కిలోమీటర్ల పొడవునా వేసి రూ.29 కోట్లు ఖర్చుపెట్టారు. పీఎంజీఎస్‌వై పథకం నుంచి 4 రోడ్లను 36.12 కిలోమీటర్లు వేసి రూ.21.04 కోట్లు కేటాయించారు. మూడు నియోజకవర్గాల్లో రూ.14 కోట్లతో పాత రోడ్లకు మరమ్మతులు చేశారు. కొమరోలు, పొదిలి, తర్లుపాడు, అర్ధవీడు, గిద్దలూరు, బేస్తవారిపేట, యర్రగొండపాలెం ప్రాంతాల్లో రోడ్లను అభివృద్ధి చేశారు. ఇక గిద్దలూరు నియోజకవర్గంలో రూ.47.59 కోట్లతో సీసీ రోడ్లను ఏర్పాటు చేశారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో రూ.29.27 కోట్లు, మార్కాపురం నియోజకవర్గంలో రూ.27.83 కోట్లతో సీసీ రోడ్లు వేశారు. పొదిలి మండలం పాములపాడు, మార్కాపురం మండలం భూపతిపల్లి తదితర గ్రామాల్లో సిమెంటు రోడ్లు నిర్మించారు.

ఆర్అండ్‌బీ పరిధిలో..

మార్కాపురం ఆర్అండ్‌బీ పరిధిలో నూతన రోడ్ల నిర్మాణం, పాత రోడ్లకు మరమ్మతులకు మొత్తం రూ.85.67 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో 36 ప్రాంతాల్లో రోడ్ల ఏర్పాటు, మరమ్మతులు జరిగాయి. ఇందులో ప్రధానంగా కొనకనమిట్ల మండలంలోని ఎదురాళ్లపాడు, గనివెనపాడు, మార్కాపురం, మిట్టమీదిపల్లి రోడ్డు, అర్ధవీడు మండలంలోని గండి నుంచి కాకర్ల, తర్లుపాడు మండలంలో నాగెళ్లముడిపి రోడ్డు, పుల్లలచెరువు, చాపలమడుగు, కేజీ రోడ్డు- బొమ్మలాపురం, ముటుకుల-యర్రబాలెం రోడ్లు ఉన్నాయి. హై ఇంపాక్ట్ కింద 55.25 కిలోమీటర్ల పొడవున నూతన రోడ్లు నిర్మిస్తున్నారు. ఇప్పటికే 3 నియోజకవర్గాల్లో రూ.15.03 కోట్లతో పీఎంజీఎస్‌వై పథకం కింద రోడ్ల నిర్మాణం పూర్తిచేశారు. మార్కాపురం నియోజకవర్గంలో రూ.6.77 కోట్లతో కొనకనమిట్ల నుంచి వయా కాట్రగుంట మీదుగా నాగంపల్లి వరకూ 13 కిలోమీటర్ల రోడ్లు నిర్మించారు. తర్లుపాడు మండలంలోని గోరుగుంతలపాడు వయా సూరేపల్లి మీదుగా చెన్నారెడ్డిపల్లి వరకూ రూ.7.19 కోట్లతో పది కిలోమీటర్ల రోడ్డును పూర్తిచేశారు. గిద్దలూరు నియోజకవర్గంలో బేస్తవారిపేట నుంచి చట్టిచర్ల, పూసలపాడు వరకూ రూ.4.83 కోట్లతో 7 కిలోమీటర్ల రోడ్డును, సత్యవోలు నుంచి రాచర్ల వయా కాల్వపల్లి మీదుగా రూ.4.20 కోట్లతో 6 కిలోమీటర్ల తారురోడ్డును పూర్తిచేశారు. పొదిలి మండలం ఉన్న గురవాయపాలెం నుంచి కృష్ణాయపాలెం వరకూ, యర్రగొండపాలెం నియోజకవర్గంలోని యర్రగొండపాలెం మండలం కోకోనికుంట నుంచి గంజివారిపల్లి వరకూ, ఆర్అండ్‌బి రోడ్డు నుంచి పీ ముడివేముల వరకూ రోడ్లకు నిధులు మంజూరు కావడంతో టెండర్లు పిలిచారు.



పొదిలి-ఒంగోలు రోడ్డు నాడు.. నేడు..



అర్ధవీడు మండలం నాగులవరం - వెలగలపాయ రోడ్డు నాడు అలా.. నేడు ఇలా..



బేస్తవారిపేట -ఒంగోలు రోడ్డు నాడు అలా.. నేడు ఇలా..

రోడ్ల అభివృద్ధికి నిధులు



పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లో హై ఇంపాక్ట్, పీఎంజీఎస్‌వై పథకం కింద రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. పలు మండలాల్లో రోడ్ల అభివృద్ధికి బీటీ రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. పలు చోట్ల రోడ్ల నిర్మాణాలు కూడా పూర్తయ్యాయి.

– రమేష్‌బాబు, ఈఈ పంచాయతీ రాజ్, మార్కాపురం.

మా రోడ్లు బాగున్నాయి



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మా మార్కాపురం ప్రాంతంలోని చాలారోడ్లు బాగుపడ్డాయి. వేములకోట నుంచి మార్కాపురం వరకూ రోడ్డు చాలా బాగుంది. మా గ్రామానికి వచ్చే రహదారిని ఇటీవలే మరమ్మతులు చేశారు.

– జంకె వెంకటనారాయణరెడ్డి, వేములకోట

ఆర్అండ్‌బీ పరిధిలో రూ.85.67 కోట్లు



మార్కాపురం ఆర్అండ్‌బీ పరిధిలో సుమారు రూ.85.67 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు జరిగాయి. పలుచోట్ల కొత్తగా రోడ్డు వేయడం, పాతవాటికి మరమ్మతులు చేశారు. ఇంకా పలు భవనాలు కూడా నిర్మించారు.

-రామాంజనేయులు, ఈఈ, ఆర్అండ్‌బీ మార్కాపురం

పేదలందరికీ ఇళ్ల పట్టాలిస్తాం

- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- ముక్తినూతలపాడు, త్రోవగుంట అర్బన్ సచివాలయాల సందర్శన
- ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పరిశీలన



లబ్ధిదారులతో మాట్లాడుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి, పక్కన మేయర్

ఒంగోలు రూరల్: పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించేందుకు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి డివిజన్-1 త్రోవగుంట, డివిజన్-2 ముక్తినూతలపాడు వార్డు సచివాలయాలను శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఇళ్ల పట్టాలు ఇచ్చే కార్యక్రమంలో భాగంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను నగర మేయర్ గంగాడ సుజాతతో కలిసి పరిశీలించారు. ప్రతి ఒక్క లబ్ధిదారునికి ఇళ్లపట్టా తప్పనిసరిగా అందాలని, ఇందులో కుల, మత, వర్గ రాజకీయాలకు అతీతంగా న్యాయం జరగాలని వార్డు సచివాలయ సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయా సచివాలయాల్లో చేరుకున్న లబ్ధిదారులను ఉద్దేశించి బాలినేని మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేస్తున్నామని ఈ నెల 20వ తేదీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి చేతులమీదుగా నిరుపేదలందరికీ పట్టాలు అందజేస్తామన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా తన చిరకాల వాంఛైన ఒంగోలు పట్టణ నిరుపేదలందరికీ ఇళ్ల పట్టాలు అందజేసి మౌలిక సదుపాయాలతో కూడిన గృహ వసతి ఏర్పాటు చేయడం తన లక్ష్యమన్నారు. ఇందుకోసం ముఖ్యమంత్రి భూమి కొనుగోలు కోసం నిధులు విడదల చేశారని అందుకు సీఎంకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందికి రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పేదలందరికీ న్యాయం జరుగుతుందని, ఎలాంటి పక్షపాతం లేకుండా పారదర్శకంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో త్రోవగుంట ఇన్‌చార్జ్ అడ్మిన్ మధు, వీఆర్వో షేక్. యజ్దాన్, ముక్తినూతలపాడు అడ్మిన్ విజయలక్ష్మి, వీఆర్వో అంకిరెడ్డి, ఒకటో డివిజన్ కార్పొరేటర్ సామ్రాజ్యం, కె.ప్రభాకర్‌రావు, వైఎస్సార్ సీపీ నాయకులు సాంబయ్య, రామాంజనేయులు హెల్త్ ఆఫీసర్ మనోహర్, మాజీ ఎమ్మెల్యే ఆదెన్న, అర్బన్ మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు రాయపాటి అంకయ్య, అర్బన్ ఎంఆర్వో సుజన్‌కుమార్, ఆర్ఐ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డితో ఆర్యవైశ్య నాయకులు

వైఎస్సార్ సీపీలోకి ఆర్యవైశ్య ప్రముఖులు

ఒంగోలు: ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సమక్షంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు శనివారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి బాలినేని ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఆర్యవైశ్య ప్రముఖులు తడవర్తి వాసు, ఆర్.ఎస్.శ్రీనివాసరావు, తాతా మధుసూదనరావు, మునగా కృష్ణారావు, రామస్వామి, చేవూరి వాసు, పచ్చిపులుసు వెంకట శ్రీనివాసు, చలువాది బ్రహ్మయ్య, చుండూరి శ్రీమన్నారాయణ, బైసాని జగన్మోహనరావు, దేవత వినోద్, అప్పల ఆనంద్, పున్నయ్య ఉన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు మట్టా రాజా, ఆర్యవైశ్య ప్రముఖులు, వ్యాపారులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంపై చర్చకు రా..

- అసత్య ప్రచారంతో కాదు..
- ఎమ్మెల్యే స్వామికి సవాలు విసిరిన మంత్రి సురేష్

సింగరాయకొండ (మర్రిపూడి): అసత్య ప్రచారంతో కాదు అభివృద్ధి సంక్షేమం పై చర్చకు రావాలని కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామికి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సవాల్ విసిరారు. సింగరాయకొండలోని కందుకూరు రోడ్డు గుంజి కాంప్లెక్స్ వద్ద శనివారం రాత్రి ప్రజలతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే స్వామికి తాను ఓటమి పాలవుతానన్న భయం పట్టుకుందని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎమ్మెల్యే స్వామి నియోజకవర్గంలో తిరుగుతున్నాడని ఎద్దేవా చేశారు. దొంగ ఓట్లతో తనకు అవసరం లేదని, సీఎం జగన్‌ను మాట్లాడే స్థాయి ఎమ్మెల్యే స్వామికి లేదన్నారు. ఎమ్మెల్యే స్వామి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న 24 సంక్షేమ పథకాలకు దీటుగా టీడీపీ ప్రభుత్వం అమలు పథకాలతో చర్చకు రావాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి, సంక్షేమం పై చర్చకు రావాలే తప్ప అసత్య ఆరోపణలు, వ్యక్తిగత దూషణలు వద్దని సూచించారు. యర్రగొండపాలెంలో తాను ఆర్టీసీ బస్టాండు, షాదీఖానా, రైతు బజారు నిర్మించానని అది అభివృద్ధి కాదా అని అన్నారు. అందరినీ కలుపుకుని పోయి ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలను అందించటమే జగనన్న లక్ష్యమని కొనియాడారు.

నియోజకవర్గంపై పూర్తి అవగాహన:

తాను నియోజకవర్గానికి వచ్చి రెండు నెలలు అయిందని, పూర్తి అవగాహన వచ్చిందన్నారు. ప్రధానంగా రోడ్లు, తాగునీరు, సాగునీరు వంటి సమస్యలు ఉన్నాయన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించటానికి అన్ని రకాల వసతులు ఉన్నాయన్నారు. విశాలమైన తీరప్రాంతం, ఉప్పు కొఠారులు, సీఫుడ్స్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు అవకాశం ఉందన్నారు. కానీ ఎమ్మెల్యే స్వామి ఏమీ చేయలేదని నియోజకవర్గాన్ని పట్టించుకోలేదని ఆరోపించారు. ఇండస్ట్రియల్ గ్రోత్ సెంటర్‌కు అవకాశం ఉందన్నారు. సింగరాయకొండలో ఆటోనగర్ ఏర్పాటు చేసి ఆటో కార్మికులకు అన్ని రకాల మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో పీబీ ఛానల్ అభివృద్ధికి ఎవరూ ప్రయత్నించలేదని తన స్వంత నిధులతో పీబీ చానల్ పూడికతీత పనులు చేపట్టానన్నారు. బోర్ల మరమ్మతులు చేయిస్తున్నానని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు, రోడ్ల మరమ్మతులు చేయిస్తున్నానన్నారు. నియోజకవర్గంలో రూ.2.38 కోట్లతో 30 పై చిలుకు అభివృద్ధి పనులు మంజూరు చేయించానన్నారు. పేద ప్రజల వైద్య చికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్ రూ.14 లక్షల విలువైన 8 చెక్కులు ఇచ్చానని, ఇప్పుడు మళ్లీ రూ.38 లక్షల విలువైన 32 చెక్కులు వచ్చాయని వీటిని పంపిణీ చేస్తానని వివరించారు. వైఎస్సార్ సీపీలో నమ్ముకున్న కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని, వారిని తన భుజం పై పెట్టుకుని మోస్తానన్నారు. అటువంటి వారు నాకు కావాలని, అంతేతప్ప ఆయారాం గయారాంలు నాకు అవసరం లేదన్నారు. తాను వచ్చిన 2 నెలల్లోనే ఇంత అభివృద్ధి చేస్తే తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని వివరించారు. ఈ ప్రాంతంలో మెడికల్, ఇంజినీరింగ్, నర్సింగ్‌కాలేజి ఏర్పాటుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ముస్లిం నాయకులు మంత్రి సురేష్‌ను ఘనంగా సత్కరించారు. పార్టీ మండల అధ్యక్షుడు సామంతుల రవికుమార్‌రెడ్డి, షేక్ పటేల్, షేక్ సలీంబాషా, షేక్ కరీం, షేక్ నౌషాద్, పఠాన్ రియాజ్, షేక్ దావూద్, షేక్ సలీం, షేక్ నిసార్, షేక్ యస్దానీ, మొఘల్ అమరుల్లా, మెకానిక్ వలీ, షేక్ కరీంబాషా, షేక్ మాబాషా, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మంత్రి సురేష్‌ను సన్మానిస్తున్న ముస్లిం నాయకులు

క్లుప్తంగా

నేడు వైఎస్సార్ ఆర్చి, విగ్రహాల ప్రారంభోత్సవం



ఆర్చి ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు

సింగరాయకొండ (మర్రిపూడి): సింగరాయకొండ మండల కేంద్రంలోని శానంపూడి అడ్డరోడ్డు వద్ద సుమారు 60 లక్షల అంచనా వ్యయంతో తన సొంత నిధులతో నిర్మించిన వైఎస్సార్ ఆర్చి, విగ్రహాల ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసులరెడ్డి, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, రీజినల్ కో ఆర్డినేటర్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నియోజకవర్గ ఇన్‌చార్జి రూప్‌కుమార్ యాదవ్, దర్శి ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాద రెడ్డి, వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్, ఏపీఐఐసీ చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు రూప్‌కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు జూపూడి ప్రభాకరరావు, మాజీ పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య ముఖ్య అతిథులుగా పాల్గొంటారని వివరించారు. దేవీ సీఫుడ్స్ కంపెనీ వద్ద నుంచి భారీ బైక్ ర్యాలీ, బహిరంగ సభ ఉంటాయన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

బర్డ్ ఫ్లూపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా పశువైద్యాధికారిణి బేబీరాణి



బర్డ్ ఫ్లూపై అవగాహన కల్పిస్తున్న జేడీ బేబీరాణి

కొత్తపట్నం: బర్డ్ ఫ్లూపై ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించి జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పశువైద్యాధికారిణి కె.బేబీరాణి సూచించారు. కొత్తపట్నం మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో ఉన్న చికెన్ దుకాణాలను శనివారం ఆమె పరిశీలించి పలు సలహాలు, సూచనలు చేశారు. చికెన్, గుడ్లు తినడం వలన ఎటువంటి బర్డ్ ఫ్లూ సోకదని, ఈ విషయాన్ని అందురూ తెలుసుకోవాలని చెప్పారు. గుడ్లు, చికెన్‌ను బాగా వండుకుని తినాలన్నారు. నెల్లూరులో కోళ్లకు బర్డ్ ఫ్లూ పాజిటివ్ రావడంతో అప్రమత్తంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. నెల్లూరు జిల్లా నుంచి కోళ్లు, కోళ్ల మేత, కోళ్లకు సంబంధించిన ఏ విధమైన మెటీరియల్ తీసుకురావద్దని ఆదేశించారు. నాటు కోళ్లు, ఫారం కోళ్లు, బాయిలర్ కోళ్లు తరచూ చనిపోతుంటే సమీపంలోని పశువైద్యాధికారికి తెలియజేయాలని కోరారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో బర్డ్ ఫ్లూపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అల్లూరు గ్రామాన్ని సందర్శించి బర్డ్ ఫ్లూపై ప్రజలకు, చికెన్ దుకాణ యజమానులకు జాగ్రత్తలు చెప్పారు. కార్యక్రమంలో కొత్తపట్నం, అల్లూరు పశువైద్యాధికారులు ఆషా, శోభ, గ్రామస్తులు పాల్గొన్నారు.

నవరత్నాలు పేదలకు వరం



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి



శివప్రసాద్ రెడ్డికి ఘనస్వాగతం పలుకుతున్న నాయకులు

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: మన ఊరు మన శివన్న కార్యక్రమంలో భాగంగా 18వ వార్డులో శనివారం నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో విశేష స్పందన లభించింది. ప్రచారంలో అడుగడుగునా అభిమానంతో ప్రజలు గులాబీ పూల బాటలు వేశారు. ఇంటింటికీ హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. దుశ్శాలువాలు, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. వార్డు మొత్తం ప్రచారం పూర్తయ్యే వరకు స్థానికులు పూలు చల్లుకుంటూ శివప్రసాద్ రెడ్డిపై తమ అభిమానాన్ని చాటుకున్నారు. ముందుగా లక్ష్మీ గణపతి స్వామి ఆలయం, శ్రీ కాశీ అన్నపూర్ణా దేవి మాతా సమేత కాశీ విశ్వనాథ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వార్డులో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ నవరత్నాలు పేదల పాలిట వరాలుగా మారాయన్నారు. జగనన్న పాలనను మెచ్చి ప్రజలు వైఎస్సార్ సీపీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. కాపులందరికీ న్యాయం చేసేందుకు కాపునేస్తం ప్రవేశ పెట్టి వారికి ప్రభుత్వం అండగా నిలిచిందని చెప్పారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా కులమతాలు, పార్టీలకు అతీతంగా ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు అందాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌కు కులాలు, మతాల వంటి బేదాభిప్రాయాలు లేవని చెప్పారు. అందరినీ సమానంగా చూసే మంచి వ్యక్తి సీఎం వైఎస్ జగన్ అన్నారు. మున్సిపాలిటీ మొత్తానికి సుమారు 100 కోట్లకు పైగా తాగునీటికి మంజూరయ్యాయని త్వరలోనే ఇంటింటికీ కుళాయిలు వేసి నీటి కష్టాలు తీరుస్తామని హామీ ఇచ్చారు. వార్డు ఇన్‌చార్జ్ హరీష్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు. హరీష్‌ను తన సొంత తమ్ముడిలా చూసుకుంటానని హామీ ఇచ్చారు. బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన దమ్ము, ధైర్యం ఉన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని చెప్పారు. కరోనా కష్ట కాలంలో సీఎం జగనన్న సైనికుల్లా ఎంతో ధైర్యంతో ప్రాణాలకు తెగించి వలంటీర్లు ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని చెప్పారు. రానున్న ఎన్నికల్లో దర్శిలో నా కుమారుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి మీ ఆశీస్సులు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కట్టెకోట హరీష్, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎం బాషా, మండల అధ్యక్షుడు వెన్నపూస వెంకటరెడ్డి, ప్రచార కమిటీ జిల్లా కార్యదర్శి అంకబాబు, కాపా రమణారెడ్డి, జేసీఎస్ పట్టణ కన్వీనర్ ఎదురుకోటిరెడ్డి, వెన్నపూస సంజీవరెడ్డి, యాతం రమణారెడ్డి, కర్నా రమణారెడ్డి, కర్నా సుబ్బారెడ్డి, కర్నా వెంకటరెడ్డి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ విమల రామకృష్ణ, కొల్లా ఉదయభాస్కర్, ఓబులాపురం సత్యనారాయణ, ఉల్లి గురువార్జున, బండారురమేష్, పాలంకి వెంకటేష్, పసుపులేటి నాగరాజు, ముత్తిసీడి కోటేశ్వరరావు, ఎదురు నరశింహారెడ్డి, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, సుశీలా ప్రతాప్, సామ్యేల్, సర్పంచ్ సంఘం అధ్యక్షుడు కేసరి రాంభూపాల్ రెడ్డి, కర్నా భాస్కర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ దామెర్ల చంద్రం, మాజీ సర్పంచ్‌లు చంద్రగిరిగురవా రెడ్డి, దామెర్ల రామ్మోహన్, కుంటా అచ్చారావు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ యరమల మధుసూదన్ రెడ్డి, సొసైటీ అధ్యక్షులు వేమిరెడ్డి చెన్నారెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కేవీ రెడ్డి, సాగర్ ప్రాజెక్ట్ మాజీ వైస్ చైర్మన్ సద్దిపుల్లారెడ్డి, శేషం రమణయ్య, ముప్పూరి బ్రహ్మయ్య, కర్నా వెంకటరెడ్డి, పానుగంటి కోటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



తర్లుపాడులో అన్నాకు ఘన స్వాగతం పలుకుతున్న నాయకులు

మీపై నమ్మకంతో జగనన్న పంపాడు

- ఎమ్మెల్యే అన్నా రాంబాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

తర్లుపాడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులపై నమ్మకంతో సీఎం వైఎస్ జగన్ తనను మార్కాపురం నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారని, మీరంతా ఆదరిస్తే.. మీ నమ్మకాన్ని వమ్ముచేయకుండా సేవ చేస్తానని నియోజకవర్గ సమన్వయకర్త గిద్దలూరు శాసనసభ్యుడు అన్నా వెంకటరాంబాబు స్పష్టం చేశారు. శనివారం తర్లుపాడులో పార్టీ నాయకులు కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని పంచాయతీల నుంచి పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే అన్నా మాట్లాడుతూ పాదయాత్రలో పేదల సమస్యలు తెలుసుకున్న సీఎం జగన్ నవరత్నాల ద్వారా ప్రతిఇంటికీ సంక్షేమం అందించారన్నారు. తన గురించి వివరిస్తూ రాజకీయాల్లోకి రాకముందే తల్లిదండ్రుల పేరుపై ట్రస్టు ప్రారంభించి నీటి సమస్య తీర్చానని, ఉచిత అంబులెన్స్‌ను ఏర్పాటు చేశానన్నారు. 100 మందికిపైగా విద్యార్థులను ఇంజినీరింగ్, ఎంబీఏ, మెడిసిన్ చదివించానన్నారు. 2019లో జగనన్న ఆశీర్వాదంతో గిద్దలూరు నియోజకవర్గ ప్రజలు కులమతాలకు అతీతంగా 81,500 భారీ మెజారిటీతో తనను గెలిపించినట్లు చెప్పారు. అర్ధవీడు, బేస్తవారపేట, కొమరోలు రైతాంగానికి న్యాయం చేసేందుకు శాసన సభ్యత్వానికి కూడా రాజీనామా చేసేందుకు వెనుకాడలేదని తెలిపారు. పాపినేనిపల్లి, వెలగలపాయ లోయల్లోని 13,500 ఎకరాలకు సాగునీరు 26 గ్రామాలకు వెలుగొండ నీటిని పోరాడి సాధించానన్నారు. చిరకాలంగా సమస్యగా ఉన్న రంగాపురం – అర్ధవీడు రోడ్డును సాధించానని, మరికొద్ది రోజుల్లో పనులు ప్రారంభమౌతాయని చెప్పారు. మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి, గిద్దలూరులో మంచి మెజారిటీతో గెలుస్తారన్నారు. పలు గ్రామాల నుంచి వచ్చిన కార్యకర్తలు ఎమ్మెల్యే అన్నాను పరిచయం చేసుకుని శాలువా, పూలదండలతో ఘనంగా సత్కరించారు. ముందుగా శ్రీ రుక్మిణీ సత్యభామా వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరుకుని పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. సమన్వయకర్తగా తొలిసారి ఎమ్మెల్యే అన్నా మండలానికి రావడంతో కార్యకర్తలు భారీ ఎత్తున టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమానికి పార్టీ అధ్యక్షుడు మురారి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీలు కె. సుజాత, చెన్నకేశవులు, మాజీ ఎంపీపీ గాయం శ్రీనివాసరెడ్డి, సొసైటీ చైర్మన్ రామిరెడ్డి, మాజీ చైర్మన్ కుందురు సత్యనారాయణ రెడ్డి, నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ పత్తి రవిచంద్ర, కోఆప్షన్ సభ్యులు అక్బర్ అలీ, మండలంలోని ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మహా శివరాత్రికి ప్రత్యేక ఏర్పాట్లు

- పర్వదినం సందర్భంగా చేపట్టబోయే ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించిన సబ్‌కలెక్టర్



ట్రాఫిక్ నియంత్రణ చర్యలపై పోలీసు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌లతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

పెద్దదోర్నాల: మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయనున్నట్లు సబ్ కలెక్టర్ రాహుల్ మీనా పేర్కొన్నారు. స్థానిక బొగ్గరపు సత్యమ్మ కళ్యాణ మండపంలో శనివారం తహశీల్దార్ హమీద్ అధ్యక్షతన మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల నిర్వహణపై నిర్వహించిన సమీక్ష సమావేశానికి సబ్ కలెక్టర్ రాహుల్ మీనా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ మార్చి 1 నుంచి 11వ తేదీ వరకు శ్రీశైలంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైలానికి తరలి వెళ్లే యాత్రికులు, భక్తులు, శివస్వాములకు మండల కేంద్రంలో అవసరమైన ఏర్పాట్లు చేపట్టేందుకు అన్నిశాఖల అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్య ప్రమాణాలను మెరుగుపరచడం, తాగునీటి వసతి, వైద్య శిబిరాలతో పాటు పలు వసతి సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సమీక్ష సమావేశంలో పాల్గొన్న సీఐ రాములు నాయక్ మాట్లాడుతూ పర్వదినం సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఘాట్‌రోడ్లలో ఏవైనా వాహనాలు మరమ్మతులకు గురై నిలిచిపోతే ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాటిని తొలగించేందుకు ప్రత్యేకంగా క్రేన్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి మోహనరావు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో పారిశుధ్య పనులు నిర్వహించేందుకు 50 మంది అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీంతోపాటు మేజర్ పంచాయతీలో పలు ప్రాంతాల్లో మినరల్ వాటర్‌తో కూడిన చలివేంద్రాలు, వాహనాలు నిలిపే ప్రాంతాల్లో తాత్కాలిక మరుగుదొడ్లు, ప్రత్యేకమైన లైటింగ్‌సిస్టమ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ మండల కేంద్రంతో పాటు కొర్రప్రోలు, చింతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 24 గంటలు వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. మార్కాపురం అసిస్టెంట్ మేనేజర్ కామేశ్వరి మాట్లాడుతూ మార్కాపురం, గిద్దలూరు, అద్దంకి, ఒంగోలు, పొదిలి డిపోల నుంచి యాత్రికుల సౌకర్యార్థం ప్రత్యేకంగా 100 బస్సులను శ్రీశైలానికి నడపనున్నట్లు తెలిపారు. పెద్దదోర్నాల, శ్రీశైలం నడుమ 4 ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతామన్నారు. కార్యక్రమంలో ఫారెస్టు రేంజి అధికారి విశ్వేశ్వరావు, నేషనల్ హైవే ఏఈ నాగస్వామి, పెద్దదోర్నాల మేజర్ పంచాయతీ సర్పంచ్ చిత్తూరి హారిక, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ మాధవరావు, ఎంపీడీఓ నాసర్‌రెడ్డి, సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ భాస్కర్‌కుమార్, విద్యుత్ ఏఈ నాగేంద్రరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భ్రమరాంబదేవి, ఆర్ఐ నాగేశ్వరరావు, ఆర్టీసీ కంట్రోలర్ హసన్‌బాష తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణిస్తున్న కారులో మంటలు

ఒంగోలు సబర్బన్: ప్రయాణిస్తున్న కారులో ఒక్కసారిగా మంటలు రావడంతో కారు డ్రైవర్ అప్రమత్తమయ్యాడు. కారును రోడ్డు మీదే ఆపేసి డ్రైవర్‌తో పాటు కారులోని ప్రయాణికులంతా కిందకు దిగిపోయారు. దీంతో కారులోని వారికి పెద్ద ప్రమాదమే తప్పింది. ఒంగోలు నగరంలోని దక్షిణ బైపాస్‌లో శనివారం సాయంత్రం ఈ సంఘటన చోటుచేసుకుంది. దక్షిణ బైపాస్ మీదుగా పాత మినీ బైపాస్‌లోకి కారు ప్రవేశిస్తుండగా, కాటా సమీపంలోకి రాగానే ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానిక ప్రగతికాలనీలోని వారు వెంటనే బకెట్లతో నీళ్లు తెచ్చి మంటలు ఆర్పారు. సమాచారం తెలుసుకున్న ఒంగోలు అగ్నిమాపక శాఖాధికారులు చేరుకుని కారులోని మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు.

మహిళలను లైంగికంగా వేధించడం నేరం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి

ఒంగోలు: పని ప్రదేశాలలో మహిళలను లైంగికంగా వేధించడం చట్టరీత్యా నేరమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ఎ.భారతి తెలిపారు. పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక దాడులు అనే అంశంపై స్థానిక జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. లైంగిక వ్యత్యాసాలు లేకుండా స్త్రీ, పురుషులు ఇద్దరూ ఎవరికి నిర్దేశించిన పనులను వారు పూర్తిచేయాలన్నారు. పని చేస్తున్న కార్యాలయాల్లో ఎవరైనా శారీరకంగా, మానసికంగా, సైగల ద్వారా మహిళలను లైంగిక వేధింపులకు గురిచేస్తే చట్ట ప్రకారం శిక్షార్హులన్నారు. బాధితులు వెంటనే సంబంధిత సంస్థలకు ఫిర్యాదు చేయాలన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి కె.సత్యకుమారి మాట్లాడుతూ జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా మహిళలకు ఉచిత న్యాయ సహాయం అందించడం జరుగుతుందన్నారు. లైంగిక వేధింపులకు గురవుతున్న మహిళలు తమ సంస్థను ఆశ్రయించి తగిన విధంగా న్యాయ సహాయం పొందవచ్చన్నారు. జూనియర్ సివిల్ న్యాయమూర్తులు వి.శిల్ప, పి.భానుసాయి, ఎం.రాధికలు ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హరాస్‌మెంట్ ఆఫ్ వుమన్ ఎట్ వర్క్ ప్లేసెస్ 2013 గురించి, సుప్రీంకోర్టు తీర్పుల గురించి వివరించారు. ఒంగోలు బార్ అసోసియేషన్ న్యాయవాదులు, న్యాయస్థానాల సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కు హెడ్‌కానిస్టేబుల్

- అభినందించిన ఎస్పీ పరమేశ్వరరెడ్డి



విజయభాస్కర్‌కు మెడల్ వేసి అభినందిస్తున్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి

ఒంగోలు సబర్బన్: అంతర్జాతీయస్థాయిలో ఆస్ట్రేలియాలో జరగనున్న మాస్టర్స్ అథ్లెటిక్స్‌కు సంతనూతలపాడులో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న విజయభాస్కర్ ఎంపికయ్యారు. అతన్ని ఎస్పీ పీ పరమేశ్వరరెడ్డి శనివారం తన చాంబర్‌లో ప్రత్యేకంగా అభినందించారు. ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన 5వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రెండు విభాగాల్లో విజయభాస్కర్ ప్రతిభ కనబరిచారు. ఆంధ్రప్రదేశ్ తరఫున పాల్గొని 50-54 ప్లస్ ఏజ్ గ్రూపులో జరిగిన పోటీల్లో లాంగ్ జంప్‌లో సిల్వర్, ట్రిపుల్ జంప్‌లో కాంస్య పతకాలు సాధించారు. ఈ ఏడాది మే నెలలో ఆస్ట్రేలియాలో జరిగే అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా ఎస్పీ పరమేశ్వరరెడ్డి విజయభాస్కర్‌ను అభినందించారు. ఎస్పీ మాట్లాడుతూ ఒకవైపు పోలీస్ విభాగంలో విధులు నిర్వర్తిస్తూనే మరోవైపు క్రీడలపై ఆసక్తితో నిరంతరం ప్రాక్టీస్ చేస్తూ జాతీయ స్థాయిలో పతకాలు సాధించి అంతర్జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించడం గర్వకారణమని కొనియాడారు. అంతర్జాతీయ స్థాయిలో కూడా సత్తాచాటాలని ప్రోత్సహించారు. క్రీడలపై ఆసక్తి ఉన్న వారిని ఎప్పుడూ ప్రోత్సహిస్తానని ఎస్పీ భరోసా ఇచ్చారు.

గుండెపోటుతో ఆర్మీ జవాన్ మృతి

రాచర్ల: మండలంలోని సోమిదేవిపల్లె గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ బత్తుల వెంకటరాజు (41) గుండెపోటుతో మృతి చెందారు. కోల్‌కతాలో సుబేదార్‌గా విధులు నిర్వహిస్తుండగా, శుక్రవారం గుండెపోటు రావడంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆదివారం సోమిదేవిపల్లె గ్రామానికి వెంకటరాజు మృతదేహానికి తీసుకొచ్చి ఆర్మీ అధికారుల లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు. వెంకటరాజుకు భార్య చంద్రకళ, ఇద్దరు కుమారులు ఉన్నారు.